**కథ**

# అనుబంధాలకు ఆవలి ఒడ్డున

◆ అంజయ్య నాయుడు ◆

**అర్ధరాత్రి కావస్తోంది. కృష్ణపక్షపు చీకటి చిక్కగా పరిచిన నల్లతివాసీలా వుంది.**

ఆకాశం మేఘావృత్తమై ఏ క్షణంలోనైనా వర్షించడానికి సిద్ధంగా ఉంది. ఆ నిశ్శబ్ధ నీరధిలో స్థబ్ధత పేరుకున్న చిక్కని చీకటిని చీల్చుకుంటూ బస్సు దూసుకపోతుంది. గాజు కిటికీనుంచి కనిపిస్తున్న గంభీరమైన చీకటి తెరలో హృదయాంతరాల్లోని గతం తాలుకూ అనుభవాల మధుర స్మృతులు సినిమా బొమ్మల్లా ఒక్కొక్కటి గుర్తుకొస్తున్నాయి.

అలివేణి... తన జీవన రాగంలో తీయని శృతి... ఉప్పొంగిన ప్రేమ సముద్రంలోని ఆణిముత్యం... ఊరి పక్క పొలాల్లో... తనూ... అలివేణి కోతి కొమ్మంచి ఆట ఆడుకోవడం... పంటలునూర్చేప్పుడు తాతయ్యాకి తెలియకుండా రాశుల్లోని ధాన్యం దొంగతనం చేసి వేరు శనగ ముద్దలు కొనుక్కోవడం... చదువుకునేప్పుడు వేసవి శలవులకు ప్రతీసారి ఊరురావడం... తాతయ్య, అమ్మామ్మ తనని ప్రేమగా చూడడం... అలివేణితో ఆకతాయతనంగా ఆడుకోవడం.....

"అలివేణి...అవును తను అలివేణి కోసమే గదూ వస్తూంటా... నిండుగా పూసిన కనకాంబరపు చెట్టులా పసిమి ఛాయతో మెరిసిపోతూ... లేడి పిల్లలా గంతులేసి అలివేణింటే తనకి వల్లమాలిన ప్రేమ.

◆◆◆◆◆

**ప్రతి శలవులకూ అలివేణికి ఓ మంచి బహుమతి పట్టుకెళ్ళటం తనకి సరదా. చిన్నప్పుడు రిబ్బన్లు... తరువాత ఓణీలు... ఈ మధ్య చీరలు...**

◆◆◆◆◆

"వచ్చేస్తాను, అలివేణీ నీ కోసం అన్నీ వదిలి వచ్చేస్తాను" అని చెప్పాలని కదూ తన తాపత్రయం అంటూ... తనని చూసి అలివేణి ఆశ్చర్యపోతుందా... ఏమో ఆ కళ్ళల్లో అంతులేని ఆనందం తను చూడాలి. తనకోసం కేవలం తన కోసం మాత్రమే బ్రతికే ఒకే ఒక వ్యక్తి అలివేణి.

"తనూ అలివేణి తోటలో మామిడి చెట్టు కింద కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకోవడం... తను దొంగతనంగా కోసిన మామిడి పిందెల్లో "నీకేది కావాలో తీసుకో"

అని చెయ్యి చాస్తే..."నీకేది యిష్టమో తీసుకొని మిగిలింది నాకియ్యి" అనేది అలివేణి. ప్రతి చిన్న విషయానికీ 'నీ యిష్టం బావా' అనే అలివేణి... తను ఎంత ఏడిపించినా కోపం తెప్పించాలని ప్రయత్నించినా చిరునవ్వుతో సమాధానం చెప్పే అలివేణంటే తనకి వల్లమాలిన ప్రేమ. ప్రతి శలవులకూ అలివేణి ఓ మంచి బహుమతి పట్టు కెళ్ళడం తనకి సరదా. చిన్నప్పుడైతే రిబ్బన్లు... తరువాత ఓణీలు... ఈ మధ్య చీరలు... యిలా...

ఓ రోజు కోవెల దగ్గర కూర్చుని కొలనులోకి చిన్న చిన్న రాళ్లు విసురుతున్న అలివేణి దగ్గరగా వెళ్ళి ఆమె కళ్ళు మూసాడు. ఎప్పటిలా 'బావా నువ్వొచ్చేశావా' అంటూ తను ఎగిరి గంతేస్తుందనుకున్నాడు. కాని సిగ్గుతో చేతులు మెల్లగా విడిపించుకొని, సోగకళ్లు మెల్లగా పైకెత్తి చప్పున చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తున్న అలివేణి ఓపట్టాన అర్థం కాలేదు... తనకి ఏమైందంటూ మెల్లగా అడిగితే 'నీ మీద బెంగబావా' ఎందుకో నిన్ని మరీ మరీ చూడాలనిపించింది. నువ్వు కనిపించగానే ఏడుపాపుకోలేక పోయాను" అంటూ వెక్కిళ్ళ మధ్య చెప్పింది" అలివేణి తలని నిమురుతూ గుండెలకానించుకున్నాడు అతను. చిత్రంగా ఆమె అతన్ని అల్లుకు పోయింది. ఇద్దరిలోను తెలియని ఉద్వేగం... ఎందుకో అలా ఎప్పటికీ ఉంటే బాగుణ్ణనిపించింది. అలా అలివేణి తనకి మరీ దగ్గరయ్యింది. ఓ రోజు అనుకోకుండా ఇద్దరూ ఒకటయ్యారు.

చిన్నప్పుడే అమ్మా నాన్నలకి దూరమైన అలివేణి తాతయ్య, అమ్మమ్మల దగ్గర ముద్దుగా పెరిగింది. అయిదో తరగతితోనే చదువాపేసిన అలివేణి తనకు రాసే ప్రేమ లేఖల్లోని భావాన్ని అర్థం చేసుకోవడానికి అయిదు గంటలు తవన్సు చెయ్యడం... పరీక్షల ముందు రాత్రులు చదువుకునేప్పుడు... నెమరు వేసుకుంటూ విరామ సంగీతంలా వింత అనుభూతి పొందడం తనకి సరదా...

ఓ రోజు..."తూరుపు కొండల్లోంచి తొంగి చూస్తున్న అరుణ భానుని నులి వెచ్చని కౌగిలిలో ప్రకృతి కాంచి పరవశించి పోతోంది. పంట చేల మీద పిల్ల తిమ్మెరలు చల్లని గాలి జెవురు రంగు చెట్ల మీదుగా మొహాన్ని తాకి

వింత పరిమళాన్ని అందిస్తుంది. "కాలువ గట్టు మీద కూర్చుని... గడ్డి పూలు పీకి వేగంగా ప్రవహిస్తున్న కాలువ నీటిలో వదులుతున్నాడు శ్రీధరం. " ఓణం పండక్కి పందెంలోని పడవల్లా వేగంగా కొట్టుకు పోతున్న గడ్డిపూలు చూస్తూ ముసి ముసి నవ్వుల్తో 'అందమైన పూలు అలా పారెయ్యకూడదు' అంది అలివేణి.


"ఏం నీ తల్లో పెట్టమంటావా!"

"పూలు తల్లో ఎవరు ఎవరికి పెడతాలో తెలుసా!" అంది అలివేణి.

"నువ్వు నాక్కాబోయే పెళ్ళాన్నివే కదా!"

"అని మనిద్దరం అనుకుంటే సరిపోతుందా?" మొన్న చూడు రామప్ప పంతులు గారి కూతుర్ని చిన్నప్పటి నుంచి చేసుకుంటానని వాళ్ల బావ నమ్మించి... చివరికి యం.బి.బి.యస్ అయిన తర్వాత తండ్రి బలవంతం మీద తనతో పని చేసే డాక్టర్ని చేసుకున్నాడు"

కాలవ గట్టుమీద వెల్లకిలా పడుకొని ఉన్న శ్రీధరం విశాలమైన ఛాతీ మీద తల ఆన్చి "బావా... ఎన్ని యుగాలైనా ఇలాగే ఉండిపోతే ఎంత బాగుణ్ణు" అంది అలివేణి.



నీ విషయంలో అలా జరుగదు అలివేణీ. భూమ్యాకాశాలు తల్లకిందులైనా... నేను నిన్నే పెళ్ళి చేసుకుంటాను. కావాలంటో ఇప్పుడే ప్రమాణం చేస్తాను" అలివేణిని తన ఒడిలో కూర్చో పెట్టుకొని చేతి మీద చెయ్యేసి ప్రమాణం చేసి బుగ్గ మీద ముద్దు పెట్టుకుంటూ అన్నాడు శ్రీధరం.

కాలువ గట్టు మీద వెల్లకిలా పడుకొని ఉన్న శ్రీధరం విశాలమైన ఛాతీ మీద తల ఆన్చి... "బావా ఎన్ని యుగాలైనా ఇలాగే ఉండిపోతే ఎంత బాగుణ్ణు" తమకంగా... మత్తుగా అర్ధ నిమీలిత నేత్రాలతో తెలియని లోకాల తలుపులు తెరుచుకున్నట్టు అంది" పరవశంతో మత్తుగా ఆమెను హత్తుకున్నాడు శ్రీధరం. విల్లులా వంగిన కను బొమ్మల మధ్య చిరు చెమటతో తడిసి ఉదయభానుని కిరణాల తాకిడికి వింత శోభతో వెలిగి పోతున్న అరుణ సింధూరాన్ని మెల్లగా ముద్దాడి అన్నాడు...

"జన్మ జన్మలకీ ఈ బావా మరదళ్ళ బంధం యిలాగే నిలిచి పోనీ.."

తను ఈ మధ్యనే ఇంజనీరింగ్ కంప్లీట్ చేసి 'రూర్కేలా' ఇంజనీరుగా చేరాడు. తండ్రి వరంధామయ్య మొన్నీ మధ్యనే ఓ బిజినెస్ మాగ్నట్ కూతుర్ని తనకి కట్ట పెట్టాలని ఐదు లక్షల రూపాయల కేష్‌కి, కోనసీమలో ఓ ఇరవై ఎకరాల కొబ్బరి తోటకి ఎసరు పెట్టి... ఇప్పటి వరకూ అయిన ఖర్చు అణా పైసల్తో వసూలు

చేసుకుని... మిగిలింది తన పేర బ్యాంకులో వేసి జీవితాంతం తను కూర్చుని తిన్నా ఏ లోటు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పాడు. ఈ విషయంలో తండ్రితో నాలుగైదు సార్లు గొడవ పడ్డాడు శ్రీధరం. "ఏది ఏమైనా తన మాటే నెగ్గించుకుంటానని లేకపోతే విషం తాగి చస్తానని" బెదిరించాడు పరంధామయ్య. తండ్రితో ఇంకా ఘర్షణ పడ్డం ఇష్టంలేక శలవులకి రెండు రోజుల ముందే బయలు దేరి రూర్కేలా వెళ్ళిపోయాడు శ్రీధరం.

దీపావళి పండక్కి ఇంటికి తిరిగొచ్చిన శ్రీధరానికి టేబులు మీద ఓ శుభలేక దర్శనమిచ్చింది. విప్పి చూసాడు. తన తల మీద ఎవరో సమ్మెటతో బలంగా కొట్టినట్టు కళ్ళు బయర్లు కమ్మాయి. తనతో మాటైనా అనకుండా తన తండ్రి తన పెళ్ళి నిర్ణయిస్తాడని కల్లో కూడా ఊహించలేదు.

అంతే... ఇంట్లోకి కూడా వెళ్ళకుండా సూట్‌కేసు తీసుకొని అలివేణి కోసం బయలుదేరాడు.

"గోపాలపురం ఎవరండీ. గోపాలపురం దిగేవాళ్లు రావాలి" కండక్టరు పిలుపుతో ఆలోచిన కడలి నుంచి తేరుకుని బస్సు దిగాడు శ్రీధరం.

అప్పుడే మాచవరం మెయిన్‌రోడ్డు మీద బస్సు దిగిన శ్రీధరం గోపాలపురం వైపు బయలుదేరాడు. "ఈదుర్లు గాలి చికాగ్గా వేస్తోంది. గుడ్లగూబల అరుపుల కీచురాళ్ల ధ్వనితో మిళితమై హారర్ సినిమాలోని బాక్ డ్రాప్ మ్యూజిక్‌లా వినబడుతున్నాయి. అభయంకర వాతావరణంలో తీతువు అరుపు విషాదం సంగీతంలో నిలయబద్ధమైన తాళంగా తన ఉనికిని తెలియజేస్తుంది. దూరంగా గుడ్డిదీపాలు మిణుకు మిణుకుమంటూ వెరుస్తున్నాయి. రహదారికి సుదూరంగా ఉండే ఆ పల్లెని చేరడానికి ఎవరైనా నాలుగు మైళ్ళు డొంక దారిలో కాలి నడకన వెళ్ళాల్సిందే. స్వాతంత్ర్యంసిద్ధించి 44 సంవత్సరాలు దాటుతున్నా భారత దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత కుంటుపడి ఉందో తెలియ జెప్పడానికి ప్రత్యక్షసాక్షిగా ఆ పల్లె తన ఉనికిని కాపాడు కొంటోంది. ఆ నిశ్శబ్ద నీరధిలో డొంక కిరువైపులా తాడి చెట్లు బ్రహ్మ రాక్షసులు బద్ధకంగా తలలూపినట్టు ఆకుల చప్పుడు చేస్తున్నాయి.

దూరంగా శ్మశానంలో చిన్ని చిన్ని మంటలు తళుక్కున మెరిసి మాయమవుతున్నాయి. బతికి ఉన్నంత కాలం ఎన్నో సమస్యల్ని సులభంగా పరిష్కరించగలిగిన మానవుని మృతదేహాన్ని భాగాలు పంచుకోవడం తేడాల వల్ల నక్కల పోట్లాటల ఊళలు తారాస్థాయిలో వినపడు తున్నాయి. గోపాలపురం చేరడానికి డొంక చివర్లో ఉన్న శ్మశానం దాటి వెళ్ళాలి. శ్మశానం దగ్గర పడింది. ఆ వైపు చూడకుండా తొందర తొందరగా అడుగులేస్తూ దాటి పోవాలను కున్నా శ్రీధరం అసంకల్పితంగా శ్మశానం వైపు దృష్టి సారించాడు. కట్టెల మధ్య కాలిపోతోంది ఓ అభాగిని దేహం. బంధాల అనుబంధాల తెరల్ని చీల్చుకుని మంటల మధ్య తెరలు తెరలుగా పొగ గాలిలో కలిపి ఐహిక బంధాలకు సుదూరంగా ఆకాశంలోని మబ్బులతో మిళితమవుతూంది. "సగం కాలిన శవం నిటారుగా లేచి... ఈ లోకంలోని కుళ్ళును కడసారి చూసి భరించలేనట్టు మళ్ళీ యధాస్థానంలో కొట్టెల మధ్య చిక్కుకుని మంటల్లో కలిసిపోయింది. జి.టి. ఎక్స్‌ప్రెస్ స్పీడుతో పరుగెత్తే గుండెల్ని అదుపులో పెట్టడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. మొహమంతా చెమటతో తడిసిపోయి పాలభాగం మీది స్వేదం నాసికాగ్రం నుంచి పై పెదవి మీదికి జారి ఉప్పగా తగుల్తోంది. గుండెల్లో తుల్లోనుంచి ఉప్పెనలా పొంగివస్తున్న వైరాగ్యపు తెరల్ని, పాల పొంగుని ఓ చిన్న నీటి బిందువు ఆపినట్టు... అసంకల్పితంగా జారిపడ్డ ఓ కన్నీటి బిందువు నిలిపివేసింది.

ఊరి బయట అయ్యలరెడ్డి కొండ దగ్గర టూరింగ్ టాకీస్‌లో ఎంతహాయి ఈ రేయి నిండినా మల్లీశ్వరి సినిమాలోని భానుమతి పాట వినిపిస్తోంది. శ్మశాన వైరాగ్యం నుంచి మళ్ళించి, ఐహికబంధాల వైప తన మనసులు లాగిందా పాట.

త్వరత్వరగా ఊరు చేరుకున్నాడు. ఆపుకోలేక ఆనందంతో ఎగిరిగంతేసి అలివేణి ఒడిలో వాలిపోవాలనుకున్న శ్రీధరం... తాతయ్య ఇంటి ముందు గుంపులు గుంపులుగా చేరిన జనాన్ని చూసి వేగంగా పరుగెత్తే రైలుకి సడన్ బ్రేక్ పడ్డట్టు పందిరి కొయ్య దగ్గర హఠాత్తుగా ఆగిపోయాడు.

"అయిపోయింది. అలివేణి మనకిక లేదు బాబూ" గుంపులోనుంచి ఏదో ఎరిగిన కంఠం దూరంగా వినిపించింది.

"పాపం కడసారి చూపుకన్నా నోచుకో లేదు. ఇంకో అరగంట ముందొస్తే ఆఖరి చూపన్నా దక్కేది. ఇద్దరూ చిలకా గోరింకల్లా ఎంత ముచ్చటగా ఉండేవాళ్ళో..." అస్పష్టంగా వినిపిస్తున్నాయి మాటలు. ఒక్క క్షణం అప్రతిభుడై పందిరి గుంజను ఆసరాగా చేసుకుని నిలబడ్డాడు. "తను వస్తూ చూసిన శవం అలివేణిదే"

జ్ఞాపకాల కడలి తరంగం అతని హృదయంలో అనుబంధాల పొరల్ని తాకింది. అనుభవాల అగ్నిగుండం బద్ధలై హృదయాంత రాళ్ళ నుంచి ఉప్పొంగిన లావాలా కళ్ళు ఎర్రబడ్డాయి.

తెలియని లోకాలలో అందమైన సెలయేటికి ఆవల ఒడ్డున అప్సరసలా నిలబడి పాల నురుగు లాంటి తెల్లని దుస్తుల్లో తనని ఆహ్వానిస్తున్న అలివేణి పడవ మీద తేలిపోతూ కలుసుకోబోతున్నట్టు మగతగా కన్ను మూసాడు శ్రీధరం.

## ఒకే కథతో రెండు చిత్రాలు!





తెలుగులో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రెండు చిత్రాల కథలు దాదాపుగా ఒక టేనని పరిశ్రమలో అనుకుంటున్నారు. హిందీలో సూపర్ హిట్ అయిన "ఫూల్ అవుర్ కాంటే' చిత్రం హక్కులు తీసుకుని జయభేరి సంస్థ కృష్ణ, నాగార్జునలతో నిర్మిస్తున్న తాజా చిత్రం డా. దాసరి ప్రధాన పాత్రపోషిస్తూ దర్శకత్వం వహిస్తున్న 'మామా—కోడలు' చిత్రాల కథ ఒకటేనని అంటున్నారు. ఈ రెండు చిత్రాల్లో తండ్రీ కొడుకుల మధ్య ఘర్షణ ప్రధానాంశం. జయభేరి చిత్రంలో కృష్ణ, నాగార్జున, మామా—కోడలులో దాసరి, రమేష్‌బాబు తండ్రీ కొడుకులుగా నటిస్తున్నారు. దాసరి, కృష్ణ లది నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలు. జయభేరి చిత్రం భారీ వ్యయంతో నిర్మిస్తుంటే మామ—కోడలు బడ్జెట్ చిత్రం. మామకోలు ఏప్రిల్, జయభేరి చిత్రం మేలో విడుదల అవుతాయి.

—నారాయణరాజు